# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 25-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పార్లమెంట్‌లో ప్రజా సమస్యలకు సంబంధించి ఫలవంతమైన చర్చలు జరగాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆకాంక్షించారు.**

2. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థపై ఈ రోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**

3. **ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా అర్హులైన లబ్ధిదారులకు కొత్త ఇళ్లు నిర్మిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

4. **తిరుమల లడ్డూ కల్తీ అంశంపై కేంద్ర దర్యాప్తు సంస్థ నేతృత్వంలోని సిట్ బృందం ఈరోజు తిరుపతిలో విచారణ చేపట్టింది.**

5. **ఈరోజు అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినం నిర్వహిస్తున్నారు.**

==========================

పార్లమెంట్‌లో ప్రజా సమస్యలకు సంబంధించి ఫలవంతమైన చర్చలు జరగాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆకాంక్షించారు. ఢిల్లీలో శీతాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమైయ్యాయి. ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల పాత్రికేయులతో ప్రధానమంత్రి మాట్లాడుతూ,

..వాయిస్... 32 సెకన్లు

ఇది ఇలా వుండగా పార్లమెంట్ సమావేశాల ప్రారంభమైన సందర్భంగా ఇటీవల మరణించిన సభ్యులకు ఉభయ సభలు నివాళులు అర్పించాయి. అనంతరం లోక్ సభని ఈ నెల 27 వరకు వాయిదా వేస్తూ లోక్ సభాపతి ఓం బిర్లా ప్రకటించారు. అలాగే రాజ్యసభను ఈ నెల 27 వరకు వాయిదా వేస్తున్నట్లు సభ చైర్మన్ జగదీప్ దన్ ఖడ్ వెల్లడించారు.

-------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ సీఆర్డీఏ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులకు టెండర్ల ఆహ్వానం, ప్రజాపతినిధులు, ఉన్నతాధికారుల భవన సముదాయాల పురోగతి వంటి అంశాలపై

ముఖ్యమంత్రి అధికారులతో చర్చిస్తున్నారు. మధ్యాహ్నం మున్సిపల్ శాఖపై సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రహదారుల మరమ్మతులపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. అలాగే సాయంకాలం వ్యవసాయ, పశుసంవర్ధక శాఖపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన–పీఎంఏ ద్వారా కొత్త ఇళ్లు నిర్మిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులో నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, –పీఎంఏ పథకానికి అర్హులైన వారందరూ తమ సచివాలయం పరిధిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకానికి రేషన్‌కార్డు, పాన్‌కార్డ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం వంటి తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. నమోదు చేసుకున్నవారి దరఖాస్తులను పరిశీలించి చర్యలు చేపడతామని మంత్రి వివరించారు.

---------------------------

తిరుమల లడ్డూ కల్తీ అంశంపై కేంద్ర దర్యాప్తు సంస్థ– సిబిఐ నేతృత్వంలోని ప్రత్యేక విచారణ బృందం – సిట్ ఈరోజు తిరుపతిలో విచారణ చేపట్టింది. తిరుపతిలోని అలిపిరి వద్ద ఉన్న టిటిడి కార్యాలయంలో అధికారులు సమావేశమైయ్యారు. ఇందులో భాగంగా సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేష్ ప్రభు, సిబిఐ ఎస్పీ మురళి, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ్ త్రిపాఠి, విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథజెట్టి, ఎఫ్.ఎస్.ఎస్.ఐ అధికారి సత్యకుమార్‌లు విచారణను జరుపుతున్నారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన జి.లక్ష్మీశ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌గా అధికారంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలు, సంక్షేమ ప్రధకాలు ప్రజలకు క్షేత్రస్థాయిలో అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తానని కలెక్టర్ పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

ఈరోజు అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినం నిర్వహిస్తున్నారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, హింస, లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు వంటి వివిధ రూపాల్లో మహిళలపై జరిగే హింసను నిరోధించడానికి ఐక్యరాజ్యసమితి ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఏటా నవంబర్ 25వ తేదీన స్త్రీ హింసా వ్యతిరేక దినంగా పాటిస్తున్నారు.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో సహజ వ్యవసాయంపై రేపు కార్యశాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంపై పశ్చిమగోదావరి జిల్లా ఆకాశవాణి ప్రతినిధి ఐ.సుబ్బారావు మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ ( 33 సెకన్లు)

---------------------------

శబరిమల అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శ్రీకాకుళం రోడ్డు నుంచి కొల్లాం వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు వాల్తేరు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు–కొల్లాం ప్రత్యేక రైలు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జనవరి 26వ తేదీ వరకు ప్రతి ఆదివారం నడుస్తుందన్నారు. తిరుగు ప్రయాణంలో కొల్లాం– శ్రీకాకుళం రోడ్డు రైలు వచ్చే నెల 2 నుంచి జనవరి 27 వరకు ప్రతి సోమవారం నడుపుతామని పేర్కొన్నారు. ఈ రైళ్లు పొందూరు, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట నుంచి కొల్లాం వరకూ ప్రధాన కూడళ్లలో ఆగుతాయని తెలిపారు. అయ్యప్పభక్తులు ఈ ప్రత్యేక రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆర్జిత సేవా టిక్కెట్లలో ఫిబ్రవరి నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటానుతిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి ఈరోజు ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. అలాగే తిరుమల, తిరుపతిలలో ఫిబ్రవరి నెల గదుల వసతి కోటాను రేపు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టికెట్లను బుక్ చేసుకోవాలని టిటిడి తెలిపింది.

---------------------------

చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వద్ద 77 ఎకరాలలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయనున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఎమ్మిగనూరులోని బనవాసి వద్ద టెక్స్‌టైల్ పార్కుకు ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టెక్స్‌టైల్ పార్కులో 3.75 కోట్ల రూపాయలతో సదుపాయాలు కల్పిస్తామన్నారు. చేనేత కార్మికులకు ముడి సరకు, ఇతర పరికరాలను రాయితీపై ఇవ్వనున్నట్లు చెప్పారు. వస్తు, సేవల పన్ను– జీఎస్టీ కింద రీయింబర్స్‌మెంట్, బీమా పథకం, ఎమ్మిగనూరులో క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

వారసత్వ కట్టడాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పురావస్తు ప్రదర్శన శాలల సహాయ సంచాలకులు రజిత అన్నారు. అనంతపురంలో రాష్ట్ర పురావస్తు, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వారసత్వ కట్టడాలు, పరిరక్షణపై వారం రోజులపాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, ప్రశంసా పత్రాలను నిన్న అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాచీన కట్టడాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని అన్నారు. వారసత్వ కట్టడాలు, వాటి విశిష్టతను యువతకి తెలియజేసే లక్ష్యంతో పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ–చుడా ఛైర్పర్సన్‌గా కె.హేమలత ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరులోని చుడా కార్యాలయంలో సంయుక్త కలెక్టర్ విద్యాధరి ప్రమాణ స్వీకారం చేయించారు. చిత్తూరు నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, జిల్లాలో అభివృద్ధి, సుందరీకరణ పనులకు ప్రాధ్యామిస్తానని హేమలత తెలిపారు.

=====================